మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మావతి నగర్‌లో బుధవారం 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, జావిదుద్దీన్ మొయిన్, వాజీద్, గణేష్, యుంగధర్, రవి, సిరాజ్, గౌస్, మౌలాలి, యోగిరాజు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి హంస వాహనం



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకర మఠంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు సుమారు 8 కిలోల వెండితో 12 లక్షల రూపాయల వ్యయంతో శ్రీ శృంగేరి శారద శంకర మఠం వారు వెండి హంస వాహనాన్ని తయారు చేయించారు. భక్తులు వెండి వాహనంలో అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని శ్రీ శృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

కార్మికుడికి వేతనం ఇప్పించిన కార్మిక నేత



మూసాపేట: తాను పనిచేసిన కంపెనీ నుంచి కార్మికుడికి రావాల్సిన డబ్బులను కార్మిక నాయకుడు రవిసింగ్ బుధవారం మూసాపేటలోని ఆయన కార్యాలయంలో అందజేశారు. భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ఫార్మా కెమికల్స్ లిమిటెడ్ కంపెనీలో గోపీ బాబూ అనే కార్మికుడు 7 సంవత్సరాలుగా పనిచేసి అనివార్య కారణాల వల్ల కంపెనీలో పని మానేశాడు. తనకు రావాల్సిన రూ.1.05 లక్షలను ఇవ్వాలని యాజమాన్యాన్ని అడిగినా నిర్లక్ష్యం వహించారు. దీంతో బీఆర్‌టీయూ కార్మిక నాయకుడు రవిసింగ్‌కు విషయం చెప్పటంతో ఆయన కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి రావాల్సిన డబ్బులను బుధవారం అందజేశాడు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు తరలిన మహిళలు



ఓల్డ్ బోయిన్‌పల్లి: బీఆర్ఎస్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచి మహిళలు తరలివెళ్లారు. బుధవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో 100 మంది మహిళలు బస్సులలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, లలితా, సంతోషి, దుర్గ, దేవి, రాజకుమారి, పద్మ, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ అడ్మిషన్లకు 30న కౌన్సెలింగ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల అడ్మిషన్ల కౌన్సెలింగ్‌ను ఈనెల 30వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియాఆజమ్ బుధవారం తెలిపారు. క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. పాల్గొనే వారు తమ దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీని ఈనెల 29గా నిర్ణయించినట్లు తెలిపారు.దరఖాస్తు ఫారాలు, ఇతర వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.


జగజ్జనని.. శుభప్రదాయిని

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పలు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు కార్పొరేటర్‌లు, పలు పార్టీల నాయకులు, భక్తులు ఆలయాలకు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)


సుమిత్రానగర్‌లోని కనకదుర్గ ఆలయంలో గాయత్రిదేవిగా ..


కేపీహెచ్‌బీ కాలనీలో కనకదుర్గ ఆలయంలో అన్నపూర్ణా దేవిగా..


మోతీనగర్ శంకర్‌మఠంలో కౌమారి దేవి అలంకరణలో..


ఫతేనగర్ పైపులైన్ రోడ్డు జవహర్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న మహిళా భక్తులు


ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అవతారంలో అమ్మవారు


ఎల్లమ్మబండ, ఎన్‌టీఆర్‌నగర్‌లో .. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


హస్మత్‌పేటలో అమ్మవారి పూజలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు


ఎన్‌టీఆర్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్


మూసాపేట రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో వనబాలా దేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ట్రాఫిక్ కో ఆర్డినేషన్ సమావేశం

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఎస్‌కెఎస్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం ట్రాఫిక్ మేడ్చల్ జోన్ డీసీపీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. మేడ్చల్ జోన్ పరిధిలోని మేడ్చల్, అల్వాల్, జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, ఆర్‌సి పురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు. వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వీడియోలు చూపించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. 8 కళాశాలల యాజమాన్యం ట్రాఫిక్ మార్షల్స్ చేయటానికి ముందుకు వచ్చారు. కార్యక్రమానికి ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యా సంస్థల బస్సులను ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలని, డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, వివిధ పోలీస్‌స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్‌కుమార్

రేపు మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం

రాయదుర్గం: మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 26వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ -టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు కోరారు. ఇంటర్ విద్యలో జరుగుతున్న సంస్కరణలు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు సన్మానం


డా. శంకర్ గౌడ్‌ను అభినందించిన కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ గణిత విభాగంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. శంకర్ గౌడ్‌కి జనరల్ పబ్లికేషన్స్‌లో ప్రపంచ స్థాయి టాప్ 2 శాస్త్రవేత్తల జాబితాలో చోటు లభించింది. ఈ సందర్భంగా బుధవారం కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది పరిశోధకుల్లో సైటేషన్ల ఆధారంగా ఎంపికైన శాస్త్ర వేత్తల్లో ఒకరిగా నిలవటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి. సురేష్, డా. ఎస్. శివారెడ్డి, డా. పి. దశరథం, డా. కె. శివకుమార్, బి. సిద్ధార్థ్, డా. బి. కిషన్, అంజుమ్ పాషా, టి. అక్షిత శర్మ, డా. పి. మెగారాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలందరికీ చీరలు అందజేయాలి

కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: బీఆర్ఎస్ పాలనలో మహిళలకు బతుకమ్మ చీరలను అందజేసినట్లుగా తేడాలు లేకుండా నేడు కూడా అందజేయాలని కార్పొరేటర్ సబిహాబేగం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు ఇచ్చిన దాఖలాలు ఎక్కడా కనబడటం లేదన్నారు. కేవలం మహిళా గ్రూపు సభ్యులకు మాత్రమే ఇస్తామని ప్రకటించినా అవి కూడా కనుచూపు మేరలో కనిపించటం లేదని విమర్శించారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా చీరలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మహిళలకు చీరలు అందజేసే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు తరగతులను నిర్వహించారు. సంస్థ కూకట్‌పల్లి కోఆర్డినేటర్ చంద్రమౌళి నాయకత్వంలో సోమ, మంగళ, బుధ మూడు రోజులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ధ్యానం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా ఉంటామని, యోగాసనాలు చేస్తే శారీరక, మానసిక ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.


తరగతుల్లో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ వెంకటయ్య తదితరులు

జేఎన్‌టీయూహెచ్‌లో బతుకమ్మ వేడుకలు



బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ సిబ్బంది, విద్యార్థులు క్యాంపస్‌లో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీసీ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూల అలంకరణలతో పాటు ప్రాంగణం అంతా రంగు రంగుల ముగ్గులతో నిండిపోయింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహా రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్. సైదా నాయక్, డా. కె. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించారు.

బీఆర్ఎస్ పాలనలోనే నియోజకవర్గం అభివృద్ధి


మహిళా మండలి భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్‌లోని దిల్‌కుష్ నగర్‌లో మహిళా మండలి భవనాన్ని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. దిల్‌కుష్‌నగర్ వాసులకు ప్రధానంగా మెయిన్‌రోడ్డు నిర్మాణం, సీసీ రోడ్డు, మౌలిక సదుపాయాలను పూర్తి చేసుకోగలిగామని అన్నారు. ప్రజలు ఇప్పటికీ కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కూకట్‌పల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. ప్రధాన్ని జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా బుధవారం బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఎల్ఐజీ కాలనీలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన కాలనీలో, పట్టణాలు, గ్రామాల నిర్మాణం కోసం సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్, జిల్లా నాయకులు తోట రమేష్, సేవా పక్షం కన్వీనర్ ఆకుల రామ్, జనరల్ సెక్రటరీ గోపి, కో కన్వీనర్‌లు వెంకటరమణ, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, సీతారాం, కిరణ్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సిబ్బంది

జేఎన్‌టీయూహెచ్ విద్యార్థికి ఇస్రోలో ఉద్యోగం


సుధీర్ కుమార్‌ను అభినందిస్తున్న వీసీ కిషన్ కుమార్‌రెడ్డి తదితరులు

సన్మానించిన వీసీ, ప్రొఫెసర్లు

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో యూనివర్సిటీ విద్యార్థి సుధీర్ కుమార్ ఇటీవల ఇస్రో నిర్వహించిన పోటీ పరీక్షలలో జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు సాధించి శాస్త్ర వేత్తగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ విద్యార్థి సుధీర్‌కుమార్ ఇస్రోలో ఉద్యోగం రావటం జేఎన్‌టీయూహెచ్‌కి గర్వకారణం అన్నారు. ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీయూఎఫ్ఆర్ డైరెక్టర్, ప్రొఫెసర్ వసుమతి, డీఏపీ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్, సీఎస్ఈ విభాగం అధిపతి, ప్రొఫెసర్ సుప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్‌లోని ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మమత ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి హాజరై హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పేదల కోసం ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వప్న, లక్ష్మీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.


క్యాంప్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ శిరీష

ఆరోగ్య రక్ష.. మహిళలకు భరోసా !

అక్టోబర్ 2 వరకు స్వస్థ్‌నారీ సశక్తి పరివార్ అభియాన్

బాలానగర్: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రధాన్ని జన్మదినం సందర్భంగా చేపట్టిన స్వస్థ్‌నారీ, సశక్తి పరివార్ అభియాన్‌కు విశేష స్పందన లభిస్తుంది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ వైద్య రంగాల్లో నిపుణులైన వైద్యులతో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

సమస్యలను గుర్తించి.. మందులు అందజేసి

ముఖ్యంగా మహిళల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి మందులు అందజేస్తారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహిళలను చైతన్య పరిచి ఆరోగ్యకేంద్రానికి ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు మహిళలను హాస్పిటల్‌లో సంప్రదించాలని సూచిస్తారు. షుగర్, బీపీ, రక్త హీనత, కేన్సర్ సంబంధిత పరీక్షలు చేస్తారు. చెవి, ముక్కు, చర్మ, దంత సమస్యలు, గొంతు యురాలజీ, థైరాయిడ్, అయోడిన్, ఐరన్ లోపాలు, సంతాన సమస్యలపై ప్రత్యేక పరీక్షలు చేయటంతో పాటు ఎటువంటి డైట్ తీసుకోవాలనే జాగ్రత్తలు చెబుతారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు.


కిటకిటలాడుతున్న ఆరోగ్య కేంద్రం

ఆమె ఆరోగ్యమే సంపదగా భావించి ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ, సశక్తి పరివార్‌కు పిల్లలు, వృద్ధులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళితే చాలా ఖర్చుతో కూడుకున్నది. పరీక్షలన్నింటినీ ఒకే చోట నిర్వహిస్తుండటంతో మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా నిర్వహించే క్యాంప్ ఇది. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి. నిపుణులైన వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేస్తాం. మహిళా ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం.

– డాక్టర్ పద్మావతి, బాలానగర్ ప్రాథమిక పట్టణ కేంద్రం